సాక్షి అనంతపురం

బుధవారం । 11 । అక్టోబర్ । 2023



ఫుట్‌బాల్ చాంపియన్ బిహార్

సబ్‌జూనియర్ బాలుర జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో బిహార్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. 10లో



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం

38.2°/ 22.8°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

రేపు కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ పరీక్ష



అనంతపురం అర్బన్: జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామకానికి సంబంధించి ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు ఈ నెల 12న కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ గాయత్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థుల జాబితాను అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టరేట్లు, అన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దారు కార్యాలయాల నోటీసు బోర్డులో ఉంచామని పేర్కొన్నారు. అదే విధంగా జిల్లా వెబ్ పోర్టల్ ananthapuramu.a p.gov.in లోనూ అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో తదుపరి భాగంగా కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జేఎన్‌టీయూలోని సెంట్రల్ కంప్యూటర్ సెంటర్‌లో జరుగుతుందని వెల్లడించారు. అభ్యర్థులు ప్రవేశ అనుమతి పత్రంతో పాటు ఏదేని గుర్తింపు కార్డు ఒరిజినల్ తీసుకుని ఉదయం 9.30 గంటలకు పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు.

నేడు జాబ్‌మేళా

అనంతపురం: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధికల్పనా అధికారి ఎ.కళ్యాణి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 35 సంవత్సరాల్లో వయసున్న వారు అర్హులు. మెడ్‌ప్లస్ ఫార్మసీలో ఫార్మసీ ఎయిడ్ పోస్టుకు పదో తరగతి ఆపై విద్యార్హత ఉన్న పురుషులు మాత్రమే అర్హులు. రూ.15 వేలు వేతనం అందుకునే ఈ పోస్టుకు నాలుగేళ్ల అనుభవం తప్పనిసరి. అలాగే డి.ఫార్మసీ పూర్తి చేసిన వారికి రూ.18వేలు వేతనంతో మెడ్‌ప్లస్ ఫార్మసీలో ఫార్మసిస్ట్ విత్ పీసీఏ పోస్టులు కల్పించనున్నారు. రూ.10,750 వేతనంతో పదో తరగతి ఆపై చదువులు పూర్తి చేసిన వారికి సీఎస్‌ఏ పోస్టులకు ఎంపిక చేయనున్నారు. ఇంటర్మీడియెట్ ఆపై చదువులు పూర్తి చేసిన వారికి రూ. 12వేల వేతనంతో ఆడిట్ అసిస్టెంట్ పోస్టు కల్పించనున్నారు. అలాగే నవభారత్ ఫర్టిలైజర్స్‌లో సేల్స్ రెప్రజెంటేటివ్‌గా పనిచేసేందుకు పదో తరగతి ఆపై విద్యార్హత ఉన్న వారిని అర్హులుగా ప్రకటించారు. ఆసక్తి ఉన్న వారు బుధవారం ఉదయం 10:30 గంటల్లోపు ఉపాధి కల్పన కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు సరైన ధ్రువీకరణ పత్రాలతో నేరుగా హాజరు కావచ్చు.

పదోన్నతుల సీనియార్టీ జాబితా సిద్ధం



అనంతపురం ఎడ్యుకేషన్: జోన్–4 పరిధిలోని మోడల్ స్కూళ్ల టీజీటీలకు పీజీటీలుగా పదోన్నతులు కల్పించేందుకు ఫైనల్ సీనియార్టీ జాబితాను సిద్ధం చేసి డీఈఓ కార్యాలయాల్లో ఉంచినట్లు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు ఎం.వెంకటకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితా మేరకు సంబంధిత టీజీటీలు సర్వీస్ రిజిష్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడేళ్ల కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్ (ఏసీఆర్) తీసుకుని ఈ నెల 12న కడప గాంధీనగర్‌లోని మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో హాజరు కావాలని సూచించారు.

చూడచక్కని ఇళ్లు

- సాకారమవుతున్న పేదల సొంతింటి కల
- జగనన్న కాలనీల్లో శరవేగంగా పనులు
- 20,345 గృహ నిర్మాణాలు పూర్తి
- రేపు సామూహిక గృహ ప్రవేశాలు

అద్దె ఇళ్లు, గుడిసెల్లో అరకొర వసతుల నడుమ జీవనం సాగిస్తున్న పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. నవరత్నాలు – అందరికీ ఇళ్లు పథకం కింద పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు శ్రీకారం చుట్టింది. జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి అందులో చూడచక్కని ఇళ్లు నిర్మించడంతో పాటు తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. అక్కడ నిర్మించిన ఇళ్లు కొత్త ఊళ్లను తలపిస్తున్నాయి.



తాడిపత్రి సజ్జలదిన్నె జగనన్న కాలనీలో ప్రారంభానికి సిద్ధమైన ఇళ్లు

రాయదుర్గం: పేదల సంపాదన కుటుంబ పోషణకే సరిపోతోంది. ఇక వారికంటూ ప్రత్యేకంగా ఇల్లు నిర్మించుకోవడం కష్టమైన పని. ఎవరైనా ధైర్యం చేసి ఇంటి నిర్మాణానికి పూనుకున్నా అప్పు చేసి పూర్తి చేయాల్సి వచ్చేది. పేదల కష్టాలను పాదయాత్ర సమయంలో కళ్లారా చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'నేనున్నాను' అంటూ భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాలు పథకాల్లో గృహనిర్మాణ పథకం చేర్చి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలో 435 జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. 70,740 మంది పేదలకు స్థలాలు ఇచ్చి 'అందరికీ ఇళ్లు' పథకం కింద పక్కాగృహాలు మంజూరు చేశారు. గృహ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో 20,345 గృహాలు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. నెలాఖరుకు మరో మూడు వేల దాకా ఇళ్లు పూర్తి కావచ్చని అధికారులు అంచనా వేశారు.

చకచకా బిల్లులు విడుదల

జగనన్న కాలనీల్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోంది. బిల్లులు కూడా చకచకా విడుదలవుతుండటంతో నిర్మాణాలు ఊపందుకున్నాయి. జిల్లాలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.605.91 కోట్లు విడుదల చేసింది. లబ్ధిదారుకు రూ.1.80 లక్షల ఆర్థిక సహాయంతో పాటు అదనంగా స్వయం సహాయక గ్రూపుల ద్వారా రూ.35 వేలు రుణం అందిస్తూ ప్రోత్సహిస్తోంది.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. తాగునీటి కోసం ఇప్పటి వరకు రూ.28 కోట్లు, గృహ నిర్మాణాలకు సంబంధించి సిమెంట్, స్టీల్ కోసం రూ.83.90 కోట్లు ఖర్చు చేసింది. విద్యుత్, రోడ్ల కోసం రూ.వంద కోట్లకు పైగా వెచ్చించింది. జిల్లా వ్యాప్తంగా ప్రతి లేఅవుట్‌లో గృహాలు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు.



రాయదుర్గంలో పూర్తయిన ఇల్లు

గృహ నిర్మాణాలపై సమీక్ష

పేదల సొంతింటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో గృహ నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కారణంగా ప్రతి సోమ, బుధ వారాల్లో కలెక్టర్ గౌతమి సంబంధిత అధికారులతో దీనిపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తున్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారుల వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య
అనంతపురం	18,899
గుంతకల్లు	10,327
కళ్యాణదుర్గం	5,575
రాప్తాడు	8,930
రాయదుర్గం	4,932
శింగనమల	3,365
తాడిపత్రి	7,589
ఉరవకొండ	11,123

జగనన్న కాలనీల వివరాలు

జిల్లాలో జగనన్న కాలనీలు	435
మంజూరైన ఇళ్లు	70,740
పూర్తయిన ఇళ్లు	20,345
వివిధ దశల్లో కొనసాగుతున్న ఇళ్లు	50,395
ఇప్పటి దాకా చెల్లించిన బిల్లులు	రూ.605.91 కోట్లు
కాలనీల్లో నీటి సదుపాయం కోసం	రూ.28 కోట్లు
సిమెంట్, స్టీల్‌కు వెచ్చించిన ఖర్చు	రూ.83.90 కోట్లు

విలువైన ఆస్తి ఇచ్చారు



జగనన్న లే అవుట్‌లో ఉచితంగా స్థలం ఇవ్వడంతో పాటు పక్కా గృహం మంజూరు చేశారు. సొంతింటి కల సాకారం చేస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం. మా లాంటి పేదలకు ఈ స్థిరాస్తి ఎంతో విలువైంది. కాలనీలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించారు.

– షాహిదా, ఉరవకొండ

గర్వంగా ఉంది



పేదలమైనా మాకూ ఒక సొంతిల్లు ఉంది. మంచి ఏరియాలో ఉచితంగా స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకునేలా ప్రభుత్వం తోడ్పాటునందించింది. ఈ మేలు మరువలేనిది. మా బాగోగులు ఆలోచించే ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం. రేపు గృహప్రవేశానికి సిద్ధం చేశాం. సొంతింటిలోకి ప్రవేశించబోతున్నందుకు గర్వంగా ఉంది.

– ఉమాదేవి, కళ్యాణదుర్గం

చాలా సంతోషం



అద్దె ఇళ్లల్లో ఉండలేక ఇన్నాళ్లు అనేక కష్టాలు అనుభవించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చల్లని దీవెనలతో సొంతింటి కల సాకారమైంది. పట్టణంలోని గౌడ లేఅవుట్‌లో ఉచితంగా స్థలం ఇచ్చి ఇల్లు కట్టించారు. ఈ మేలు ఎన్నటికీ మరిచిపోలేను. ఖరీదైన ప్రాంతంలో రూ.లక్షల విలువ చేసే స్థిరాస్తిని ఉచితంగా అందివ్వడం సంతోషంగా ఉంది.

– శారద,రాయదుర్గం

రేపు గృహప్రవేశాల పండుగ



కలెక్టర్ ఆదేశాల మేరకు జగనన్న కాలనీల్లో ఈ నెల 12న గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని పండుగలా చేపట్టేందుకు సర్వం సిద్ధం చేశాం. గృహప్రవేశాల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు 20,345 ఇళ్లను పూర్తి చేయించాం. స్వాధీన పత్రాలను ఎమ్మెల్యేల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేస్తాం. తాడిపత్రి అర్బన్ సజ్జలదిన్నె జగనన్న కాలనీలో జిల్లాస్థాయి గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించనున్నాం. కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ ఇతర ప్రముఖులు హాజరవుతారు.

– నరసింహారెడ్డి, ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ

పథకాలపై ప్రజల్లో చైతన్యం పెంచాలి





మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, మేయర్ వసీం, హాజరైన సభ్యులు, అధికారులు

- వాటి ఫలాలు అర్హులందరికీ చేర్చాలి
- దిశ సమావేశంలో ఎంపీ రంగయ్య
- మాతా శిశు మరణాలు కొనసాగుతుండడంపై జెడ్పీ చైర్‌పర్సన్ అసంతృప్తి

అనంతపురం సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో చైతన్యం పెంచాలని, వాటి ఫలాలు అర్హులకు చేరేలా చూడాలని ఎంపీ తలారి రంగయ్య అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) జిల్లా స్థాయి సమావేశం అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో గల డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఎంపీ రంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం నగర మేయర్ వసీం సలీం, కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ డీఆర్‌డీఏ, మెప్మా పరిధిలో వివిధ పథకాల కింద అర్హులకు బ్యాంక్ రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. పశుసంవర్థక శాఖ ఆస్పత్రుల వద్ద నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) గురించి అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీ ల్యాడ్స్ పనులను సకాలంలో ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారని వివిధ శాఖల అధికారులను ప్రశ్నించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రైతుల్లో చైతన్యం తెస్తే కిసాన్ రైలును తిరిగి ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు.

మాతా శిశు మరణాలకు బాధ్యులపై చర్యలు తీసుకోండి

మాతా శిశు మరణాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా ఇంకా ఎందుకు కొనసాగుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను నిలదీశారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల ధనదాహానికి అనేక మంది మాతృమూర్తులు, పసికందులు మృత్యువాతపడుతున్నారన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే తరచూ ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గార్లదిన్నెలోని మైనారిటీ హాస్టల్‌లో 250 మందికి గాను ఏకంగా 450 మంది విద్యార్థులు ఉంటున్నారని, హాస్టల్‌ను విస్తరించడంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని మేయర్ వసీం కోరారు.

పథకాలపై విస్తృత అవగాహన కల్పించండి

పథకాలపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలని, అప్పుడే నిర్దేశిత లక్ష్యాలను చేరుకోగలమని కలెక్టర్ గౌతమి అన్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద వర్తించే రోగాల జాబితా ప్రదర్శించాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్సకు నిరాకరిస్తే జరిమానా విధించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్ ప్రతిఒక్కరితో డౌన్‌లోడ్ చేయించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ రబీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గుర్తింపు కార్డు కల్గిన కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందించాలన్నారు. కలెక్టరేట్ ఎదుట చెరువు కట్టపై రోడ్డు పెద్ద పెద్ద గుంతలతో నరకప్రాయంగా మారిందని, దీన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని దిశ కమిటీ సభ్యుడు లింగాల రమేష్ కోరారు. రాయదుర్గం జీన్స్ పరిశ్రమకు లోవోల్టేజీ సమస్య లేకుండా చూడా లని మునిసిపల్ చైర్‌పర్సన్ శిల్ప కోరారు. హౌసింగ్, ట్రాన్స్‌కో ఏఈలు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గుమ్మఘట్ట ఎంపీపీ భవాని తెలిపారు.

కౌశల్ సైన్స్ టాలెంట్ టెస్ట్

- ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు మాత్రమే అవకాశం
- 8, 9, 10 తరగతులకు క్విజ్, పోస్టర్ కాంపిటీషన్ పోటీలు

అనంతపురం ఎడ్యుకేషన్: భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు విజ్ఞానశాస్త్రంపై 'కౌశల్ సైన్స్ టాలెంట్ టెస్ట్' నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పాఠశాల, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి క్విజ్, పోస్టర్ పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందజేయనున్నారు. రాష్ట్రస్థాయి విజేతలకు గవర్నర్ చేతుల మీదుగా అభినందించనున్నారు. ఈ పోటీలకు నవంబరు 5లోగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రాథమిక స్థాయి నవంబరు 21, 22, 23 తేదీల్లో, జిల్లాస్థాయి పోటీలు డిసెంబరు 8న, రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబరు 29, 30 తేదీల్లో జరగనున్నాయి.

సైన్స్ క్విజ్ పోటీలు ఇలా...

8, 9, 10 తరగతుల విద్యార్థులకు గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులతో పాటు 'విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి' అనే అంశంపై పోటీలు ఉంటాయి. ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలుంటాయి. క్విజ్ టీంల ఎంపిక కోసం ఆన్‌లైన్‌లో ప్రాథమిక స్థాయి పరీక్ష ఉంటుంది. ఒక పాఠశాలలో మూడు తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు వచ్చిన మార్కులను కలిపి పాఠశాల మార్కు నిర్ణయిస్తారు. జిల్లాలో మొదటి 36 స్థానాల్లో నిలిచిన పాఠశాలలను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. జిల్లాస్థాయి క్విజ్ పోటీలు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయి.



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఈఓ నాగరాజు

పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు ఇలా...

జనరల్ థీమ్...'జీవ వైవిధ్యం', 'వాతావరణ మార్పు–పర్యావరణ', 'నీటి పొదుపు', 'విజ్ఞానశాస్త్ర రంగంలో భారతీయ కృషి' అనే అంశాలపై ఒక పాఠశాల నుంచి 8, 9 తరగతుల విద్యార్థుల నుంచి ఇద్దరు (రెండు ప్రెజెంటేషన్‌లు) పోస్టర్‌ను అప్‌లోడ్ చేయడానికి అనుమతిస్తారు. జిల్లాస్థాయికి 36 పోస్టర్లను ఎంపిక చేస్తారు. జిల్లాస్థాయిలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన పోస్టర్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

విద్యార్థులు విరివిగా పాల్గొనాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కౌశల్–2023 పోటీల్లో విరివిగా పాల్గొనాలని డీఈఓ వి.నాగరాజు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. వివరాలకు www.bvmap.org సైట్‌ను సందర్శించవచ్చని లేదా జిల్లా కో ఆర్డినేటర్ రాము 86390 94539ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ, అప్కాస్ట్ కోఆర్డినేటర్ ఆనంద భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

అనంతపురం: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ యోగా పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. అనంతపురంలోని ఇండోర్ స్టేడియం, కొత్తూరు జూనియర్ కళాశాల వేదికగా మంగళవారం ఈ ఎంపికలు చేపట్టారు. మొత్తం 150 మంది క్రీడాకారులు పోటీపడగా.. అండర్ 14 బాలికల విభాగంలో కీర్తన, తన్మయి, తేజస్విని, మహేశ్వరి, ప్రణతి, హారిక, కావ్య, మంజుల, లావణ్య, రజని ఎంపికయ్యారు. బాలుర జట్టుకు గౌతమ్, అశోక్‌కుమార్, పవన్‌కుమార్, వంశీ, లతీఫ్, ఎస్‌కే జంగి బంజరం, జస్వంత్ కుమార్, గౌతమ్, వినీత్, ప్రవీణ్‌కుమార్ ఎంపికయ్యారు. అండర్ 17 బాలికల విభాగంలో దీపిక, తనూజ, ప్రియా, కౌసార, శశికళ, గీతిక, గంగోత్రి, పావని, సమీరా, అంజలి, నవ్యశ్రీ.. బాలుర జట్టులో నహీద జోగి, మహేంద్రా, బాబు సల్మాన్, గోవర్ధన్, వెంకటయ్య నాయుడు, హేమంత్ కుమార్, శివశంకర్, అరవింద కుమార్ చోటు దక్కించుకున్నారు. ఎంపిక ప్రక్రియలో ఉభయ జిల్లాల ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలు బి.సుగుణమ్మ, అంజన్న, జిల్లా కో–ఆర్డినేటర్ ఎల్.నాగరాజు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణకు సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులు, ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్, తదితర అంశాలపై కలెక్టర్ మంగళవారం రెవెన్యూ భవన్‌లో డీఆర్‌ఓ గాయత్రీదేవితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఇంటింటి సర్వేని క్రాస్ వెరిఫికేషన్ చేయాలని చెప్పారు. జిల్లాకు 7,070 బ్యాలెట్ యూనిట్లు, 5,500 కంట్రోల్ యూనిట్లు, 6,756 వీవీ ప్యాట్‌లు వచ్చాయన్నారు. ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ ఈ నెల 16 నుంచి నవంబరు 10 వరకు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఏ దశలోనూ విమర్శలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీఓలు మధుసూదన్, నిషాంత్‌రెడ్డి, రవీంద్ర, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శంకరయ్య, కేశవనాయుడు, డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమెన్ పాల్గొన్నారు.

రూరల్ తహసీల్దార్ కార్యాలయ ఏర్పాటుకు సన్నాహాలు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు రెవెన్యూ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. కళ్యాణదుర్గం రోడ్డులోని కేకే కాలనీ పంచాయతీ కార్యాలయాన్ని త్వరలోనే నూతన భవనంలోకి మార్చనున్నారు. ఖాళీ అయ్యే పంచాయతీ కార్యాలయ భవనంలో రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఇక నగరంలోని హెచ్చెల్సీ సమీపంలోని తహసీల్దార్ కార్యాలయం అర్బన్‌కు పరిమితం కానుంది.

సిబ్బంది నియామకానికి చర్యలు

రూరల్ తహసీల్దారు కార్యాలయంలో సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, సర్వేయర్, కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు అటెండర్లను నియమించాల్సి ఉంది. ఇప్పటికే రూరల్ తహసీల్దారుగా విజయలక్ష్మిని కలెక్టర్ నియమించారు. సిబ్బంది నియామకానికి సంబంధించి ఫైలును కలెక్టర్ అనుమతి కోసం అధికారులు పంపించారు.

క్లుప్తంగా

కానిస్టేబుల్‌కు ఆర్థిక సాయం



కానిస్టేబుల్ రవి దంపతులకు నగదు అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: కష్టంలో ఉన్న కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అండగా నిలిచారు. డీటీసీలో పని చేస్తున్న కానిస్టేబుల్ రవికుమార్ కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లుగా తెలుసుకున్న ఎస్పీ... ఆయన శస్త్రచికిత్సకు అవసరమయ్యే రూ.2.13 లక్షలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు అవసరమైన డబ్బు లేక ఇబ్బంది పడుతున్న రవికుమార్ దుస్థితిపై సహచర ఉద్యోగులు స్పందించిన తీరుపై హర్షం వ్యక్తం చేశారు. రాయదుర్గం రూరల్, కళ్యాణదుర్గం రూరల్, డీసీఆర్‌బీ సీఐలు విశ్వనాథచౌదరి, యుగంధర్, తేజోమూర్తి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో రూ.2.13 లక్షలు పోగు చేయడం అభినందనీయమన్నారు. ఇదివరకే జిల్లా పోలీసు ఉన్నతాధికారులు చొరవతో రూ.6 లక్షల ఆర్థిక సాయాన్ని ఆర్డీటీ నిర్వాహకులు అందజేశారని గుర్తు చేశారు. బాధిత కానిస్టేబుల్ దంపతులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయబాస్కర్ రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'సురక్ష'.. పేదల ఆరోగ్య రక్ష

- జిల్లాలోని 28 ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణ
- చికిత్స చేయించుకున్న 7,537 మంది



బెళుగుప్ప మండలం రామసాగరంలో కరియప్పకు గుండె సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణ పండుగలా సాగుతోంది. మంగళవారం మొత్తం 28 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించగా, 7,537 మంది చికిత్సలు పొందారు. ఇందులో 1,591 మందికి వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద చికిత్సలు అందజేశారు. జబ్బు తీవ్రత ఉన్న 376 మందిని గుర్తించి, జిల్లా ఆస్పత్రితో పాటు నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. మొత్తం 112 మంది ప్రత్యేక వైద్య నిపుణులు, వైద్యాధికారులు, సిబ్బంది వైద్య సేవలు అందించారు.

నేడు 24 వైద్య శిబిరాలు

జిల్లా వ్యాప్తంగా 24 ప్రాంతాల్లో బుధవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

మండలాల వారీగా నేడు ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాలు

మండలం	వైద్య శిబిరం నిర్వహణ గ్రామం
అనంతపురం రూరల్	ఆకుతోటపల్లి
బెళుగుప్ప	తగ్గుపర్తి
కణేకల్లు	డి.హోన్నూరు
బీకేఎస్	బుక్కరాయసముద్రం
గార్లదిన్నె	కనుంపల్లి
గుత్తి	తొండపాడు
గుమ్మఘట్ట	బెలోడు
కళ్యాణదుర్గం	ఈస్ట్ కోడిపల్లి
కంబదూరు	కురాకులపల్లి
కణేకల్లు	కణేకల్లు
కుందుర్పి	మలయనూరు
నార్పల	నార్పల
పామిడి	రామరాజుపల్లి
యాడికి	లక్షుంపల్లి
పుట్లూరు	కోమటికుంట్ల
రాప్తాడు	మరూరు
రాయదుర్గం	చదం గొల్లలదొడ్డి
శెట్టూరు	కైరేవు
తాడిపత్రి	చిన్నపొలమడ
ఉరవకొండ	పెద్దకొకుంట్ల
వజ్రకరూరు	కొనకొండ్ల
విడపనకల్లు	వేల్పుమడుగు
పెద్దవడుగూరు	లక్షుంపల్లి
యల్లనూరు	మల్లగుండ్ల

సీఎం జగన్‌తోనే పేదల స్థితిగతుల్లో మార్పు



కళ్యాణదుర్గం మండలం పాలవాయిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించి, వైద్య సేవలపై స్థానిక వృద్ధుడు దొనప్పతో ఆరా తీస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల స్థితిగతుల్లో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయని మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. సీఎం ప్రవేశపెట్టిన పథకాలు, చేపట్టిన కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. కళ్యాణదుర్గం మండలం పాలవాయిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న వారిని గుర్తించారని, అనంతరం వారి నివాసాలకు చేరువగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, వైద్య పరీక్షలతో పాటు నాణ్యమైన చికిత్సలూ ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్న జగనన్న అవసరం మరోసారి ఈ రాష్ట్రానికి ఉందన్నారు. అనంతరం వృద్ధులకు ఆయుష్మాన్ భవ కార్డులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, డాక్టర్లు విజయేంద్ర, ప్రత్యూష, పవన్‌కుమార్, రాధారాణి, ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ, సీనియర్ నాయకులు నరేంద్రరెడ్డి, బ్రహ్మయ్య, సర్పంచ్ నాగరత్నమ్మ, ఎంపీటీసీ లింగమ్మ, నాయకులు గోపాల్, పాతన్న, శ్రీనివాసులు, మల్లికార్జున, చిరంజీవి, బాలాజీ నాయక్, నాగభూషణ, రామాంజి, హనుమంతు, బండమీద రామాంజి, మాలప్ప, సచివాలయ ఉద్యోగులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పిల్లలతో కలసి తల్లి ఆత్మహత్యాయత్నం

- సకాలంలో కాపాడిన రైల్వే పోలీసులు



బాధితురాలిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

ధర్మవరం అర్బన్: కుటుంబ సమస్యలతో విసిగిపోయిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలను తీసుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోయింది. సకాలంలో స్పందించిన రైల్వే పోలీసులు వారిని కాపాడారు. వివరాలు... అనంతపురంలోని నందమూరి నగర్‌కు చెందిన షర్మిలాభాను మంగళవారం ఉదయం తన ఇద్దరు పిల్లలను తీసుకుని ధర్మవరం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ప్లాట్‌ఫాంపై అటు ఇటూ తచ్చాడుతున్న ఆమెపై జీఆర్పీ సిబ్బంది నిఘా వేశారు. కాసేపటి తర్వాత రైలు వస్తున్నట్లుగా అధికారులు అనౌన్స్ చేసిన తర్వాత పిల్లలను తీసుకుని ఆమె ప్లాట్‌ఫాం వెంబడే రైలు పట్టాలపై ముందుకు సాగింది. వెంటనే అప్రమత్తమైన రైల్వే పోలీసులు ఆగమేఘాలపై ఆమెను చేరుకుని పట్టాలపై నుంచి పక్కకు లాగి ప్రాణాలు కాపాడారు. అనంతరం స్టేషన్‌కు తీసుకెళ్లి కుటుంబసభ్యులను పిలిపించారు. తన భర్త, అత్తతో ఉన్న గొడవల వల్ల విసిగిపోయి తాను ఆత్మహత్య చేసుకోవాలని వచ్చినట్లు పోలీసుల ఎదుట బాధితురాలు వాపోయింది. దీంతో కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలంటూ షర్మిలాభాను తల్లిదండ్రులకు సూచించి, పిల్లలతో సహా ఆమెను అప్పగించారు.

పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

పెద్దవడుగూరు: విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని పెద్దవడుగూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుళ్లాయిస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత నెల 8న ఎంపీ తలారి రంగయ్య ఆకస్మిక తనిఖీలు చేపట్టిన సమయంలో మేడిమాకులపల్లి గ్రామ సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న గ్రేడ్-3 కార్యదర్శి శివయ్య, గ్రేడ్ -5 కార్యదర్శి భ్రమరాంబ విధులకు హాజరు కాలేదన్నారు. అయితే విధులకు హాజరైనట్లుగా రిజిస్టర్‌లో సంతకాలు మాత్రం చేశారన్నారు. గుర్తించిన ఎంపీ రంగయ్య... ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. విచారణ అనంతరం వీరి పనితీరు సక్రమంగా లేదంటూ పలువురు ఫిర్యాదులు అందజేశారని, ఈ నివేదిక ఆధారంగా ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు.

అనారోగ్యంతో ఆర్మీ జవాన్ మృతి



గోపాల్ (ఫైల్)

ఉరవకొండ: స్థానిక పాతపేటకు చెందిన ఆర్మీ జవాన్ రెడ్డిమాసి గోపాల్(41) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. హర్యానాలోని అంబాలలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విధుల నిర్వహణలో నిమగ్నమై ఉన్నప్పుడు ఒక్కసారిగా ఆరోగ్యం క్షీణించడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందారు. గోపాల్‌కు భార్య అనితమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జిల్లా హ్యాండ్ బాల్ జట్ల ఎంపిక

కళ్యాణదుర్గం: ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకూ వైఎస్సార్ జిల్లా కడపలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ మంగళవారం కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించారు. దాదాపు 120 మంది క్రీడాకారులు హాజరు కాగా, వీరిలో ప్రతిభ చూపిన వారిని జిల్లాకు ఎంపిక చేశారు. బాలుర జట్టులో జి.హర్షవర్ధన్, ఎస్.సాదిక్, ఈ.రాజు, బి.వినోద్‌నాయక్, బి.వంశీకుమార్, ఆర్.ధనుష్, కె.దశ్వంత్, ఎం.హరినాథ్ బాబు, బి.సాయికిరణ్, వి.కార్తీక్, ఎం.బన్ని, వి.రవిచంద్ర, డి.సాయి జగన్‌మోహన్, ఎం.జశ్వంత్ రెడ్డి, ఎం.సింహాద్రి, వై.సూర్యతేజ, డి.జశ్వంత్‌నాయక్, డి.ఈశ్వర్, బి.రాజశేఖర్, ఎస్.నవీన్, టి.నాగ మహేష్ చోటు దక్కించుకున్నారు. బాలికల జట్టుకు డి.భవ్యశ్రీ, పి.కరిష్మా సుల్తానా, టి.శారద, బి.గీతాంజలి, జి. నాగరత్న, ఎం.సంధ్య, సి.మిత్ర, ఎస్.సానియా, జె.మీనాక్షి, జి.వరలక్ష్మి, టి.సుష్మిత, జి.గంగమ్మ, వి.నాగేశ్వరి, సి.స్వాతి, పి.నిత్య బ్రాహ్మణి, ఈ.బసమ్మ, ఎం.గాయత్రి, జె.సాయి చైతన్య, బి.నాగలక్ష్మి, బి.లావణ్య చోటు దక్కించుకున్నారు. ఎంపిక ప్రక్రియను జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి శివశంకర్, పాఠశాల హెచ్ఎం గంధం శ్రీనివాసులు, సభ్యులు సిద్ధార్థ బాబు, పీడీలు, పీఈటీలు పర్యవేక్షించారు.

మత్స్య సహకార సంఘం అధ్యక్ష ఎన్నికకు షెడ్యూల్ విడుదల

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా మత్స్య సహకార సంఘం పాలకవర్గ సభ్యుల ఎన్నికలు నవంబర్ 22న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను మత్స్యశాఖ డీడీ కె. శాంతి మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 16న ఓటుకు అర్హులైన వారి వివరాల ప్రకటన ఉంటుంది. 21న ఓటరు లిస్టు విడుదల చేస్తారు. 31న ఓటరు లిస్టు పరిశీలన, నవంబర్ 6న ఓటరు లిస్టు ముసాయిదా జాబితా విడుదల, 10న అభ్యంతరాల స్వీకరణ, 14న తుది ఓటరు జాబిత ప్రకటన ఉంటుంది. 22న ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ నామినేషన్ల స్వీకరణ, 11 నుంచి 12 గంటల వరకూ పరిశీలన, 12 నుంచి 1 గంట లోపు నామినేషన్ల ఉపసంహరణ, 2 గంటలకు ఎన్నికలు (చేతులు ఎత్తి మద్దతు తెలిపే పద్ధతి) నిర్వహిస్తారు.

ఫుట్‌బాల్ చాంపియన్ బిహార్





బిహార్ జట్టుకు విజేత ట్రోఫీని అందజేస్తున్న ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, రన్నరప్ ట్రోఫీని అందుకుంటున్న ఢిల్లీ జట్టు

- అంతిమపోరులో ఢిల్లీపై విజయం
- ముగిసిన జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు
- ఫుట్‌బాల్‌కు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తాం : ఎంపీ కోటగిరి శ్రీధర్



విజయోత్సాహంతో కేరింతలు కొడుతున్న బిహార్ క్రీడాకారులు

అనంతపురం: జాతీయ ఫుట్‌బాల్ టోర్నీ చాంపియన్‌షిప్‌ను బిహార్ జట్టు దక్కించుకుంది. అనంత క్రీడాగ్రామం వేదికగా 15 రోజులుగా ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో (ఏఐఎఫ్ఎఫ్) సాగుతున్న సబ్ జూనియర్ బాలుర జాతీయ ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బిహార్, ఢిల్లీ జట్లు హోరాహోరిగా తలపడ్డాయి. మ్యాచ్ ఆద్యంతం ఎంతో ఉత్కంఠగా సాగింది. స్టేడియం మొత్తం ఈలలు, కేకలతో హోరెత్తింది. మిడ్‌ఫీల్డ్ ఆటగాళ్లు, ఫుల్‌బ్యాక్, సెంటర్ బ్యాక్‌లోని ఆటగాళ్లు మెరుపు వేగంతో బంతిని కదిలిస్తూ ప్రత్యర్థి ఆటగాళ్లను ముప్పుతిప్పలు పెడుతూ బంతిని గోల్ పోస్టుకు చేరుస్తుంటే, గ్యాలరీలో కూర్చొన్న ప్రేక్షకులు ఊపిరి బిగబట్టి చూస్తుండి పోయారు. ప్రత్యర్థి జట్ల స్ట్రైకర్ల ఎత్తుగడలను విఫలం చేస్తూ బంతిని గోల్ కాకుండా ఇరు జట్ల గోల్ కీపర్లు అడ్డుకుంటూ మ్యాచ్‌ను పూర్తి ఉత్కంఠ స్థాయికి తీసుకెళ్లారు. ఆట చివరి నిమిషం వరకూ ఏ జట్టూ గోల్ సాధించలేకపోయింది. మరి కొన్ని సెకన్లలో ఆట ముగుస్తుందనుకుంటున్న తరుణంలో బిహార్ జట్టు క్రీడాకారులు అయూష్ కుమార్ గోల్ చేసి, జట్టును విజయతీరాలకు చేర్చాడు. అంపైర్లు టైమ్ అవుట్ ప్రకటించగానే బిహార్ ఆటగాళ్ల కేరింతలతో స్టేడియం హోరెత్తింది. నాలుగు పర్యాయాలు గోల్‌పోస్టుకు అత్యంత చేరువగా వెళ్లినా ఒక్క గోల్ కూడా చేయలేకపోయిన అసహాయ స్థితిలో ఉన్న ఢిల్లీ జట్టు క్రీడాకారులు మ్యాచ్ చేజారిన వెంటనే మైదానంలోనే కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, టోర్నీ ఆరంభం నుంచి బిహార్ జట్టు క్రీడాకారులు దూకుడుగానే ఆడుతూ ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తూ వచ్చారు.

ఫలించిన కోటగిరి శ్రీధర్ కృషి

ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాధ్యతలు స్వీకరించిన మూడు నెలలకే ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ టోర్నీ నిర్వహణకు కృషి చేశారు. అనంతపురం వేదికగా అతి పెద్ద ఈవెంట్ నిర్వహణకు అవకాశం ఇవ్వడంతో పాటు 15 రోజుల పాటు క్రీడాకారులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడంపై ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీ శ్రీధర్‌కు అభినందనలు తెలిపారు. గత నెల 26న టోర్నీ ప్రారంభమైన ఈ టోర్నీలో 20 రాష్ట్రాలకు చెందిన జట్లు ప్రాతినిధ్యం వహించాయి. ఆర్డీటీ సహకారంతో పాటు ఎంపీ కోటగిరి శ్రీధర్ రూ.30 లక్షలు వెచ్చించి టోర్నీని విజయవంతంగా నిర్వహించారు. విజేత జట్లను అభినందిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఫుట్‌బాల్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తూ యువతను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తామన్నారు. టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. అనంతరం విజేత క్రీడాకారులను ఘనంగా సన్మానించి, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ డిప్యూటీ సెక్రటరీ కె.సత్యనారాయణ, ఆర్డీటీ ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిళ్లు లేని సమాజాన్ని నిర్మించాలి

- సీనియర్ సివిల్ జడ్జి దీన



ర్యాలీని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి దీన

అనంతపురం మెడికల్: మానసిక ఒత్తిళ్లు లేని సమాజాన్ని నిర్మించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి దీన పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి దీన మాట్లాడుతూ.. వివక్షకు తావు లేకుండా, కులమతాలకు అతీతంగా జీవించినప్పుడే అందమైన మానసిక ఆరోగ్యంతో కూడిన సమాజాన్ని నిర్మించగలమన్నారు. అందరినీ ప్రేమగా పలకరించడం, చేతనైన సాయం చేయడం, బాధల్లో ఉన్న వ్యక్తిని ఓదార్చి వారి స్థితిగతులను మార్చేందుకు తమ వంతు సాయం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి దరి చేరకుండా చేయవచ్చునన్నారు. యోగా, ప్రాణాయామం, శారీరక శ్రమ, మంచి ఆలోచనలు కలిగి ఉన్నప్పుడే ఇవి సాధ్యమవుతాయన్నారు. అనంతరం జీజీహెచ్ వరకూ సాగిన ర్యాలీని ఐఎంఏ హాల్ వద్ద ఆమె ప్రారంభించారు. జీజీహెచ్ వద్ద నర్సింగ్ విద్యార్థులు మానవ హారం ఏర్పాటు చేసి మానసిక ఆరోగ్యంపై ప్రజలను చైతన్య పరుస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ శాశ్వత చైర్మన్ కె.శ్రీనివాసరావు, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ అనంతపురం శాఖ అధ్యక్షుడు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ వైద్యనాథ్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతోనే రాణింపు



బహుమతి అందజేస్తున్న కమాండెంట్ గంగాధరరావు

బుక్కరాయసముద్రం: వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడే విధుల సమర్థవంతంగా నిర్వహించగలుగుతారని పోలీసులకు ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్ గంగాధరరావు సూచించారు. బీకేఎస్ మండలం జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో పోలీసు సిబ్బందికి ఏఆర్‌సీ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమాండెంట్ గంగాధరరావు మాట్లాడుతూ... పోలీసుగా ఉద్యోగంలో చేరిన వెంటనే వివిధ అంశాలపై నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. రోజూ క్రమం తప్పని వ్యాయామం, యోగా చేయాలన్నారు. అనంతరం వృత్తి పరమైన అంశాలపై అనుమానాలు నివృత్తి చేశారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ రమణమూర్తి, డీఎస్పీ రమణమూర్తి, ఆర్ఐలు రాము, నాగేంద్ర, లోకేశ్వర నాయుడు, రామారావు, ట్రైనీ ఎస్ఐలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం సిటీ: స్థానిక మారుతీనగర్‌కు చెందిన కేవీ కరుణాకర్(35) మృతదేహాన్ని రాంనగర్ బ్రిడ్జి సమీపంలోని రైలు పట్టాలపై మంగళవారం ఉదయం గుర్తించినట్లు జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. ఆత్మకూరు మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన శిల్పను ఆయన పెళ్లి చేసుకున్నారు. ఓ పాప కూడా ఉంది. ఏడాది క్రితం కుటుంబంలో తలెత్తిన మనస్పర్థల కారణంగా దంపతుల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకునేవి. ఈ క్రమంలో విసుగు చెందిన శిల్ప ఆర్నెళ్ల క్రితం కుమార్తెను తీసుకుని పుట్టింటికి చేరుకుంది. నగర శివార్లలోని ఓ కార్పొరేట్ ఎంటడీగా పని చేసే కరుణాకర్.. ఐదు రోజుల కిందటే ఉద్యోగానికి కూడా రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే ఒంటరి జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

నేడు కళ్యాణదుర్గంలో 'జగనన్నకు చెబుదాం'

అనంతపురం అర్బన్: జగనన్నకు చెబుదాం - 'స్పందన' ప్రజా సమస్యల పరిష్కార వేదిక మండలస్థాయి కార్యక్రమం బుధవారం కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. స్థానిక దొడఘట్ట రోడ్డులోని ఆర్డీటీ ఎకాలజీ సెంటరులో ఉదయం పది గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

సీఎంను కలిసిన శ్రీశైలం ట్రస్టుబోర్డు సభ్యుడు



మధుసూదన్‌రెడ్డిని అభినందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు మధుసూదన్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎమ్మెల్యే, బోర్డు చైర్మన్, సభ్యులు, తదితరులు శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు సీఎంను ఆహ్వానించారు.

ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఆత్మకూరు: రైతులందరికీ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారులు అన్నారు. మంగళవారం మండలంలోని సిద్దరాంపురంలో ఏఈఓ సుజిత, వ్యవసాయ సిబ్బంది ఈక్రాప్ బుకింగ్ చేసిన రైతుల వద్దకు వెళ్లి ఈ కేవైసీ చేయించారు. ఏఓ సుచరిత ఆత్మకూరు ఆర్‌బీకేలో ఉండి ఈకేవైసీ చేయించారు.

షాపింగ్ కాంప్లెక్స్ అపరిశుభ్రం



షాపింగ్ కాంప్లెక్స్‌లో మద్యం బాటిళ్లు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని కొత్తూరు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్ అపరిశుభ్రంగా తయారైంది. నగరపాలక సంస్థ అధికారులు బాధ్యతారాహిత్యం, నిర్వహణ లోపంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. కొందరు మద్యం సేవిస్తున్నారు. మూతపడిన షాపుల వద్ద మల,మూత్ర విసర్జన చేస్తుండడంతో అపరిశుభ్రం నెలకొంది. నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 210 షాపులు ఉన్నాయి. 206 షాపుల నుంచి ప్రతి నెలా నగరపాలక సంస్థకు రూ.25 లక్షల నుంచి రూ.27 లక్షల వరకు ఆదాయం వస్తుంది. కానీ నిర్వహణను పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.

ఫోర్టిఫైడ్ బియ్యంతో వంటలు రుచికరం

- జిల్లా కలెక్టర్ ఎమ్. గౌతమి



కృష్ణ కళామందిరంలో వంటల పోటీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం. గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

అనంతపురం అర్బన్: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న నాణ్యమైన బియ్యంతో చేసిన వంటకాలు రుచికరంగా ఉన్నాయని కలెక్టర్ ఎమ్.గౌతమి అన్నారు. మంగళవారం స్థానిక కృష్ణకళామందిర్‌లో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన పీడీఎస్ బియ్యంతో వంటకాలు తయారు చేసే పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పోషక విలువలున్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తోందన్నారు. కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ వ్యవహారాల శాఖ ఫోర్టిఫైడ్ బియ్యంపై మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఫోలిక్ యాసిడ్, ఐరెన్, జింక్, బి–12 వంటి విటమిన్లు, పోషకాలను కలిపి, ..ఆ పిండిని బియ్యం పోలికతో కెర్నెల్స్‌గా మారుస్తారన్నారు. బియ్యం, ఇతర ఆహార ధాన్యాల్లో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ కలిపి సరఫరా చేస్తారన్నారు. వీటి ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అందుతాయన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం : వంటల పోటీల్లో చేసిన వంటకాలను కలెక్టర్ రుచి చూసి బాగున్నాయని ప్రశంసించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా విజేతలు బహుమతి, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వంటల పోటీల్లో మొదటి బహుమతి లక్ష్మీనరసమ్మ, రెండో బహుమతి సంధ్య, మూడో బహుమతి చిదంబరమ్మ అందుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, డీఎస్ఓ శోభరాణి, మెప్మా పీడీ విజయలక్ష్మి, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, తహసీల్దారు శ్రీధర్‌మూర్తి, ఏఎస్ఓ జగన్‌మోహన్‌రావు, సీఎస్‌డీటీలు లక్ష్మిదేవి, ప్రతిమ, హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.



మొదటి బహుమతి అందుకుంటున్న లక్ష్మీనరసమ్మ



ద్వితీయ బహుమతి అందుకుంటున్న ఎ.సంధ్య



తృతీయ బహుమతి అందుకుంటున్న చిదంబరమ్మ

పార్కింగ్‌కు అవకాశం కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద అంబులెన్స్‌లు నిలుపుకునేందుకు అవకాశం కల్పించాలని కలెక్టరేట్ ఎదుట ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ల సంఘం నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, సంఘం నాయకుడు జిలాన్‌బాషా మాట్లాడారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రభుత్వ ఆస్పత్రి ప్రహరీ వెంబడి అంబులెన్సులు నిలుపుతున్నామన్నారు. ఉన్నఫలంగా అంబులెన్సులను ట్రాఫిక్ పోలీసులు తీయించడంతో తామంతా ఉపాధి కోల్పోయామన్నారు. అనంతరం డీఆర్ఓ గాయత్రిదేవికి నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డ్రైవర్లు బాలరాజు, రామాంజనేయులు, గోపాల్, అమర్‌నాథ్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



ఏఈ రామాంజనేయులును సన్మానిస్తున్న సిబ్బంది

అనంతపురం అర్బన్: అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు వస్తుందని సమాచార శాఖ డీఐపీఆర్ఓ గురుస్వామి శెట్టి తెలిపారు. సమాచార ఏఈగా ఉన్న రామాంజనేయులును ప్రభుత్వం శ్రీ సత్యసాయి జిల్లాకు బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక సమాచార శాఖ కార్యాలయంలో ఏఈ రామాంజనేయులుకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. డీఐపీఆర్ఓ మాట్లాడుతూ రామాంజనేయులు వివిధ స్థాయిల్లో 25 ఏళ్ల పాటు అంకితభావంతో పనిచేసి, గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో పీఆర్ఓ సూర్యనారాయణరెడ్డి, సిబ్బంది ప్రభావతి, చాంద్‌బాషా, దుర్గా సుహాసిని, దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విరూపాక్షేశ్వరాలయ చైర్మన్‌గా కలువల



కలువల సతీష్

అనంతపురం కల్చరల్: జిల్లాలోనే అతి ప్రాచీనమైన ఓబులదేవర సమేత విరూపాక్షేశ్వరాలయం చైర్మన్‌గా నగరానికి చెందిన కలువల సతీష్ ఎంపికయ్యారు. ఆయనతో పాటు జవారీ మీన, ముచ్చుకోట నరసింహులు, నగేష్‌కుమార్, వాసంతి, భావన, తులసి ఇతర ధర్మకర్తల మండలి సభ్యులుగా, ఆలయ అర్చకుడు నిఖిల్ నారాయణను ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎంపిక చేశారు. కలువల సతీష్ ఎంపికపై వైఎస్సార్‌సీపీ నాయకులు తిరువీధుల జగదీష్, సత్రసాల మంజునాథ్ తదితరులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి

అనంతపురం కార్పొరేషన్: జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప కార్యక్రమమని, పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని పాతూరు నంబర్ – 1 స్కూల్‌లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యతో కలిసి మేయర్ పరిశీలించారు. వివిధ కౌంటర్లలో రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. మేయర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. పేద ప్రజలకు పైసా ఖర్చు లేకుండా వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దకే వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, బాబాఫక్రుద్దీన్, అనిల్‌కుమార్ రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, డాక్టర్ రోహిత్ పాల్గొన్నారు.

నేడు బైక్‌ల వేలం

పామిడి: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలకు బహిరంగ వేలం ఉంటుందని సీఐ ఎం రాజశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఆసక్తి కలవారు రూ.1000 ధరావతు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం



కళ్లద్దాలు అందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని డాక్టర్ దయాకర్, ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. మంగళవారం తలుపూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తలుపూరు, వడ్డుపల్లి గ్రామ ప్రజలు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు. బీపీ, షుఘర్, సాధారణ జబ్బులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. కంటి సమస్యలున్నవారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మొత్తం 321 మందికి వైద్య పరీక్షలు చేసి, 14 మందిని రెఫర్ చేసినట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మీనారాయణరెడ్డి, ఓబులేష్, ఎంపీటీసీ ఓబులేసు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బాలపోతన్న, వైస్ ఎంపీపీలు విజయ్, నీలిమ, జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, మాజీ సర్పంచులు శివారెడ్డి, ఓబిరెడ్డి, తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ వలెంటీర్లు పాల్గొన్నారు.

నేడు గొల్లపల్లిలో ఆరోగ్య సురక్ష

రాప్తాడు: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బుధవారం గ్రామ సచివాలయం దగ్గర జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లక్ష్మీ నరసింహ, ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శ్రావణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

164 మందికి వైద్య పరీక్షలు

కనగానపల్లి: పేదలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. మంగళవారం కుర్లపల్లి తండా సచివాలయం వద్ద ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. 164 మందికి వైద్య పరీక్షలు చే శారు. డాక్టర్లు ప్రశాంత్‌కుమార్, చైతన్యకుమార్, సుచరిత, ఈఓఆర్డీ అనిల్ కుమార్, ఎంపీహెచ్ఈఓ మనోహర్, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, స్థానిక సర్పంచ్ విజయ్‌నాయక్, తదితరులు తెలిపారు.

నేడు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు మేయర్ వసీం అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరగనుంది. నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 10 అంశాలతో అజెండా సిద్ధం చేశారు. నగరంలోని మాస్టర్ ప్లాన్ రోడ్లకు ఆనుకొని ఉన్న భవనాలకు ఇంపాక్ట్ ఫీజులు వసూలు చేయాల్సి ఉంది. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల బాధ్యతారాహిత్యంతో ఫీజులు వసూలు చేయడంలో నగరపాలక సంస్థ అధికారులు వెనుకబడ్డారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో రూ. కోట్లలో ఆదాయానికి గండిపడుతోంది.

ఇదే అజెండా: నగరపాలక సంస్థ నీటి సరఫరా ప్రాజెక్టు సమగ్ర రిపోర్టు తయారు చేయడానికి ఎస్ఎస్ అసోసియేట్స్ కన్సల్టింగ్ ఇంజినీర్స్, ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు టెండర్ కేటాయింపు, సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లతో నగరంలోని వివిధ ప్యాకేజీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్యాకేజీ 18కి సంబంధించి సోమనాథ్ నగర్ మేజర్ బ్రిడ్జి, రామాలయం గుడి వద్ద మైనర్ బ్రిడ్జిల మధ్య ఉన్న లింకు రోడ్డుకు రూ.1.87 కోట్లు మంజూరు చేశారు. అందులో మైనర్ బ్రిడ్జికి రూ.70 లక్షలు, లింకు రోడ్డు కు రూ.38 లక్షల మొత్తాన్ని నగరపాలక సంస్థ సాధారణ నిధులతో చెల్లించాలని, 18వ డివిజన్‌లో రూ.1.45 కోట్లతో జిమ్ ఏర్పాటు, మృతి చెందిన వడ్డే పెద్ద సంగప్ప, దస్తగిరి, రాఘవేంద్ర, వారి కుటుంబ సభ్యులకు ఒప్పందకార్మికులుగా ఉద్యోగావకాశం, తదితర అంశాలతో అజెండా సిద్ధం చేశారు.

దసరా ఉత్సవాల బుక్‌లెట్ల విడుదల

అనంతపురం కల్చరల్: నగరంలోని వాసవీ కల్యాణ మంటపంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల బుక్‌లెట్లు, పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. పాతూరు అమ్మవారి శాల అధ్యక్షులు పిన్ను నాగరత్నం, ప్రధాన కార్యదర్శి చల్లా కృష్ణరంగయ్య, గర్జాల నాగరాజు, సాయినాథ్ గుప్తా, తిరువీధుల బదిరీ నారాయణ, వంకదారు వెంకటకృష్ణ తదితరులు మాట్లాడారు. ఈనెల 15 నుంచి 24 వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా జరుగుతాయన్నారు. 18న తోటోత్సవంలో వాసవీ అమ్మవారు వనవిహారిణిగా సాగే వేడుక నయనానందకరంగా సాగుతుందన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

అనంతపురం రూరల్: నూతన మెనూను అమలు చేసి, విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందని ఫుడ్ సేఫ్టీ సలహా కమిటీ జిల్లా సభ్యుడు గుజ్జల లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం బుక్కరాయసముద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మెనూలో మార్పులు చేసిందన్నారు. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

టపాసుల లైసెన్స్‌కు 289 దరఖాస్తులు

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా దీపావళి పండుగ సందర్భంగా టపాసుల తాత్కాలిక విక్రయ లైసెన్స్ కోసం 289 దరఖాస్తులు అందాయి. ఇందులో నగరానికి సంబంధించి 149 దరఖాస్తులు ఉన్నాయి. అందిన దరఖాస్తులపై పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తారు. అందులో అర్హులైన వారికి రెవెన్యూశాఖ తాత్కాలిక లైసెన్స్ మంజూరు చేస్తుంది.

హిందూస్థాన్ స్కౌట్స్‌పై కేసులు నమోదు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: నిరుద్యోగులను మోసగించిన హిందూస్థాన్ స్కౌట్స్ సంస్థపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సంస్థ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుల్లాయిస్వామి మాట్లాడుతూ జిల్లాలో బీటెక్, డిగ్రీ, ఎంటెక్, ఎంబీఏ పూర్తి చేసిన వారి నుంచి హిందూస్థాన్ స్కౌట్స్ అనే సంస్థ ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసి మోసం చేసినట్లు తెలిపారు. బాధితులు ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రాష్ట్రస్థాయి పోటీలకు 'మాంటిస్సోరి' విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక సంగమేష్‌నగర్‌లోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు వివిధ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని మంగళవారం మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత సి.సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాల్ కె.పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో చెస్ అండర్–17 బాలికల విభాగంలో వి.శ్రీవిజ్ఞ, బాలుర విభాగంలో వి.కమల్ ఆర్చరీ, బాస్కెట్ బాల్ పోటీల్లో డీఎండీ ఆసీఫ్ రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని సూర్యనారాయణరెడ్డి తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని యానిమేటర్లు (వీఓఏలు) మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. యానిమేటర్ల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, వీఓఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి పాల్గొని మాట్లాడారు. మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌తో వీఓఏలు తీవ్ర నష్టం చేకూరుందున్నారు. గ్రామ సమాఖ్యల (వీఓ) విలీనం ద్వారా చాలా మంది వీఓఏలు ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్ఓ గాయత్రి దేవికి నాయకులు వినతిపత్రం అందజేశారు.

15న ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

అనంతపురం కల్చరల్: స్థానిక కమలానగర్‌లోని రోటరీ స్కూల్ ప్రాంగణంలోని రోటరీక్లబ్ ఆవరణలో సక్షమ్, రోటరీక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15న మెగా కంటి వైద్యశిబిరం జరుగుతుందని సక్షమ్ అధ్యక్షుడు సుంకు వేణుగోపాల్, కార్యకారిణి డాక్టర్ భాను కిరణ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9440157009లో సంప్రదించాలన్నారు.

13న ప్రాంగణ నియామకాలు

అనంతపురం రూరల్: ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెక్సావేర్ ఆధ్వర్యంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల కోసం ఈ నెల 13న ప్రాంగణ నియామకాలు ఉంటాయని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన టపాసుల సీజ్

అనంతపురం క్రైం: పాతూరులోని వన్‌వేలోని ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను వన్ టౌన్ పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. దుకాణ నిర్వాహకుడు నందపై కేసు నమోదు చేశారు. దాడుల్లో అనంతపురం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ రెడ్డప్ప, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు పరిపాలన విభాగాలను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీపీఓలోని ఏ సెక్షన్, బీ సెక్షన్, సీ సెక్షన్‌లతో పాటు అన్ని విభాగాలు పరిశీలించారు. రికార్డుల మెయింటెన్స్ పక్కాగా ఉండాలని ఆదేశాలు చేశారు. పనులు త్వరగా పూర్తి చేసి పంపాలన్నారు.

పోస్టాఫీస్ సేవలు సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: పోస్టాఫీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం డివిజన్ ఎస్పీ శ్రీహరిబాబు తెలియజేశారు. మంగళవారం ఆత్మకూరులో పోస్టాఫీసులో అందుబాటులో ఉండే పథకాలు, ప్రజలు సద్వినియోగం చేసుకునే సేవలపై వివరించారు. ఆయన మాట్లాడుతూ (డీసీడీపీ) డ్రాక్ కమ్యూనిటీ, డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై అవగాహన కల్పించారు. పోస్టాఫీసు సిబ్బంది బీమా ప్రీమియంల గురించి, సుకన్య సమృద్ధియోజన పథకం, తపాలా జీవిత బీమా పథకం, ఫిక్స్‌డ్ డిపాజిట్ తదితర పథకాలపై వివరించారు. ఈనెల 13న ఆత్మకూరులో ఏర్పాటు చేయనున్న ఆధార్‌సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు సర్పంచు వరలక్ష్మి, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విధులకు హాజరు కాకపోతే చర్యలు

రాప్తాడు: విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు తప్పవని డీఎల్‌పీఓ సుమన జయంతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయాన్ని డీఎల్‌పీఓ సుమన జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధికారులు విధులకు సక్రమంగా హాజరుకావాలన్నారు. సకాలంలో ఇంటి పన్నులు, బిల్డింగ్ అప్ర్యూవల్స్, ట్యాక్సులు వసూలు చేసి పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచులు సాకే తిరుపాలు, శశికళ తదితరులు పాల్గొన్నారు.